

కథా కౌముది

# కిం కర్తవ్యం

విజయ్ ఉప్పులూరి

శ్రీకృష్ణ- సత్యల జీవితంలో మరిచిపోలేని సంఘటన జరిగిన రోజది. మాటల్లో చెప్పలేని ఉద్వేగానికి లోనయిన వారిద్దరూ కళ్ళార్పకుండా టెర్రస్ తలుపు వైపే చూస్తూ కూర్చున్న అపురూప క్షణాలవి.

X X X

## 1990

"కాదు....ఇద్దరే"

"అదేం కుదరదు. ముగ్గురు. ఆట్టే మాట్లాడితే నలుగురు."

" అమ్మ బాబోయ్! నలుగురే....? నేను కనలేను బాబూ!" తల అడ్డంగా తిప్పేస్తూ అంది శర్వాణి.

" ఇదిగో చూడు! కనడానికే నీకింత బాధయితే- ఆ తరువాత ఎత్తుకుని పెంచి పోషించాల్సిన వాడ్ని- నాకెంత ఇబ్బందో ఆలోచించావా? మన వృద్ధాప్యంలో మనల్ని కాలు కింద పెట్టనివ్వకుండా చూసుకునేందుకు మనకు నలుగురు పుత్ర రత్నాలు ఉంటే ఎంత బాగుంటుందన్న తీయని భావన మదిలో మెదిల్తే చాలు - ఎన్ని కష్టనష్టాలు ఎదురయినా లక్ష్యపెట్టకూడదని అనిపిస్తుంది నాకు! నువ్వేమంటావ్?" ఆమె కళ్ళలోకి ప్రేమగా చూస్తూ అన్నాడు కిరీటి.

"సినిమా పదిహేడో రీల్ లో జరిగే సన్నివేశాల గురించి ఇప్పట్నుంచే ఊహించుకుని మురిసిపోతున్నారన్నమాట" కళ్ళు గుండ్రంగా తిప్పుతూ అంది శర్వాణి.

"మరేమనుకున్నావ్! మనకు పుట్టబోయే నలుగురూ మగ పిల్లలే! ఆడపిల్లలొద్దు మనకు. వాళ్ళను పెంచి పెద్ద చేయడంలో పెద్ద రిస్క్ ఉంది."

"అబ్బాయిలే పుడతారని ఏమిటి గ్యారంటీ? నాకు ఆడపిల్లలే పుడితే?" కవ్విస్తూ అంది శర్వాణి.

"అదేం కుదరదు. నువ్వు మగపిల్లల్నే కంటావ్! ఇదిగో! ముందే చెబుతున్నా! కాదూ కూడదని ఆడపిల్లను కన్న మరుక్షణం నీకు విడాకులిచ్చేస్తా! గుర్తుంచుకో!"

"అబ్బ! ఏమిటా బెదిరింపు? ఆడపిల్లల్ని కనను మహాప్రభో! డజను మంది మగపిల్లల్నే కంటాను – సరేనా?" చిలిపిగా చూస్తూ అంది శర్వాణి.

"ఏమిటి– డజనా? వద్దు. నలుగురు చాలు.డజను మందైతే వాళ్ళకు నేను పేర్లు వెదికి పెట్టలేను. నలుగురికే పేర్లు సిద్ధం చేసి ఉంచాను.పెద్దాడి పేరు....."

"సోమలింగమా?" మధ్యలోనే అందుకుని వెక్కిరింతగా అంది శర్వాణి.

" ఏం కాదు. ఇంతవరకూ ఎవరూ పెట్టని కొత్త పేర్లు సుమా!– పెద్దాడి పేరు తూర్పు,రెండో వాడు పడమర, మూడో వాడు ఉత్తరం,ఇకపోతే– నాలుగో వాడు దక్షిణం." నవ్వుతూ చెప్పాడు కిరీటి. "ఇవా మీరు పెట్టే పేర్లు? వాళ్ళను బడిలో చేర్పిస్తే మిగతా పిల్లలు మన పిల్లల్ని ఏడ్పించుకు తినరూ?– తూర్పెటు?అని ప్రశ్నిస్తే– మన పెద్దాడి వైపు చూపిస్తారు. రెండో వాడ్నేమో పిండి మర అని మారుపేరుతో ఎగతాళి చేస్తారు.'ఒరేయ్ ఉత్తరం! ఒక ఉత్తరం రాసి పెట్టవూ? అంటూ మూడో వాడ్ని అల్లరి పెడతారు. చిన్నవాడ్ని మాత్రం వదులుతారూ?– దక్షిణ చెల్లించు.... లేకుంటే భక్షణే" అని వేపుకు తింటారు.నా పిల్లలేమైనా సుఖంగా బ్రతకాలని ఉందా మీకు?" రుసరుసలాడుతూ తనూ ఊహల్లోకి వెళ్ళిపోయింది శర్వాణి.

" ఏయ్!నన్నంటావు కాని నువ్వు మాత్రం పూర్తిగా కలల మనిషివి కాదూ? నిజంగానే నలుగురిని కనేసి వాళ్ళు నేను పెట్టిన పేర్లతో యాతన పడిపోతుంటే చూసి భరించలేనట్లు బెంబేలు పడిపోతున్నావ్! ఇంకా పుట్టనివాళ్ళపై ఇప్పుడే ఇంత ప్రేమైతే– నిజంగా వాళ్ళు పుట్టాక ఇక నేను అక్కర్లేకుండా పోతానేమో!" కొంటెగా చూస్తూ అన్నాడు కిరీటి.

అతని మాటలకి సిగ్గు ముంచుకు రాగా–అతని వళ్ళో తల దాచుకుంది శర్వాణి.

"మరో విషయం చెప్పడం మరిచేపోయాను.మనకు పిల్లలు కావాలి కాని – వెంటనే కాదు. మన పెళ్ళయిన రెండేళ్ళ తరువాత– అంతవరకూ మనం ఫామిలీ ప్లానింగ్ పాటిద్దాం. ఏమంటావ్?" చెప్పాడు కిరీటి.

"అమ్మయ్య – బ్రతికి పోయాను.పెళ్ళయిన మరుసటి రోజు నుంచే – కనమని ప్రాణాలు తీస్తారేమోనని హడిలి చచ్చాను. ఈమాత్రం జాలి చూపినందుకు చాలా థాంక్స్!"

"అసలు కారణం అది కాదు. పిల్లల్ని కనడం మొదలెడ్తే నువ్వు లావైపోతావేమోనని భయమోయ్ నాకు!"ఆట పట్టిస్తూ అన్నాడు కిరీటి.

" ఆ భయమేమీ అక్కర్లేదు లెండి మీకు. నేను చస్తే లావు కాను, హామీ ఇస్తున్నా – సరేనా?" బుంగమూతి పెడుతూ అంది శర్వాణి.

నవ్వేసాడు కిరీటి.ఆమె కురులు సవరిస్తూ కాస్సేపు మౌనంగా ఉండిపోయాడు. ఆతరువాత తనే తిరిగి అన్నాడు – "మన పిల్లలు మాత్రం మనల్ని 'అమ్మానాన్నా' అనే పిలవాలి. మమ్మీ,డాడీ అనే పిలుపులు నాకు రుచించవు."

శర్వాణి బదులు చెప్పలేదు.ఏదో ఆలోచిస్తున్నదానిలా మౌనంగా ఉండిపోయింది.

"ఏమిటా పరధ్యాస! ఏ లోకంలో విహరిస్తున్నావ్?" నవ్వి అన్నాడు కిరీటి.

శర్వాణి నవ్వలేదు.– "ఇన్ని కలలు కంటున్నాం కాని ఒకవేళ మనకసలు పిల్లలే పుట్టకపోతే?" బెంగగా అంది.

"పుట్టరూ? ఏమిటా పిచ్చి మాటలు? ఎందుకు పుట్టరు?మనకేమైనా వయసు మళ్ళిందా?" బిగ్గరగా నవ్వేసాడు కిరీటి.

" పిల్లలు పుట్టడం–పుట్టకపోవడం మన చేతిలో లేదు. అదంతా దేవుని దయ.పిల్లల కోసం ఏళ్ళ కొద్దీ తపస్సు చేసేవాళ్ళను ఎంత మందిని చూడ్డం లేదు మనం?" బేలగా అంది శర్వాణి.

" నా బొంద! దేవుడి చేతిలో ఏముంది? అమ్మాయయినా, అబ్బాయయినా అంతా క్రోమోజోముల మహాత్యం. మన శరీర నిర్మాణంలో ఎలాంటి లోపం లేకపోతే మనకి పిల్లలు పుట్టి తీరుతారు."– అంటూ ఒక క్షణం ఆగిపోయాడు కిరీటి.

తిరిగి తనే అన్నాడు – " నాకో బ్రిలియెంట్ ఐడియా వచ్చింది. పెళ్ళయిన తరువాత ఎన్నాళ్ళకూ పిల్లలు పుట్టకపోతే డాక్టరు దగ్గరకు వెళ్ళి పరీక్ష చేయించుకోవడం సాధారణంగా జరిగే తంతు.పెళ్ళి కాక ముందే పరీక్షలు చేయించుకునే వాళ్ళు  నాకు తెలిసినంతలో ఎవరూ లేరు.మనమే ఆ పని చేసి ఒక చరిత్ర సృష్టిస్తే ఎలా ఉంటుంది?"

" అంటే...?"

" ఏముంది? మనం పెళ్ళికి ముందే డాక్టర్ దగ్గరకు వెళ్ళి టెస్ట్ చేయించుకుందాం."

" మీకేం పిచ్చిపట్టలేదు కదా?"  విసురుగా అంది శర్వాణి.

" అవును. తప్పేముంది?అలా చెయ్యడం వల్ల నష్టమేముంటుంది? ఇంతకుముందు నీకొచ్చిన అర్థం లేని అనుమానాలు, శంకలు నివృత్తి చేసుకున్నట్లూ ఉంటుంది." ఉత్సాహంగా అన్నాడు కిరీటి.

ఏమనడానికీ తోచని సందిగ్ధావస్థలో పడిపోయింది శర్వాణి.

"సరేననవోయ్! ఇంతవరకూ పెళ్ళికాని ఏ జంటా ఆచరించని విధానానికినాంది పలికిన వాళ్ళమవుతాం."

శర్వాణి బదులు పలకలేదు.ఆలోచిస్తున్నదానిలా మౌనంగా ఉండిపోయింది.

"ఏం భయమా? ఇంత పిరికిదానివనుకోలేదు."

"నాకేం భయం లేదు.నేను పిరికిదాన్ని కాదు." రోషంగా అంది శర్వాణి.

"భేష్! ఇంకేం!! ఇబ్బందే లేదు!!!"

"రేపే మనం డాక్టర్ దగ్గరకు వెళదాం." చురుకుదనం పుంజుకుని అన్నాడు కిరీటి.

సరేననక తప్పలేదు శర్వాణికి!

"అయితే విను. రేపు మనం డాక్టర్ అహోబిలరావు దగ్గరకు వెళ్తున్నాం."

"మగ డాక్టర్ దగ్గరకా? బాబోయ్! నేను రాను.

"మరి?"

"డాక్టర్ అంబుజం దగ్గరకు వెళదాం"

"లేడీ డాక్టరా? నో!"

"మరేం చేద్దాం?" వెక్కిరిస్తూ నవ్వింది శర్వాణి.

కిరీటి ఆలోచనలో పడిపోయాడు.కాస్సేపాగి అన్నాడు– "ఒక పని చేద్దాం. డాక్టర్ శ్రీకృష్ణసత్య దగ్గరకు వెళ్దాం.ఇద్దరూ డాక్టర్లే! ఒకే బిల్డింగ్ లోకి వెళ్తాం.నేను డాక్టర్ శ్రీకృష్ణ దగ్గర టెస్ట్ చేయించుకుంటాను. నువ్వు డాక్టర్ సత్య దగ్గరకు వెళ్తావ్! పరీక్ష ముగిసిన తరువాత ఇద్దరం కలిసే తిరిగి రావొచ్చు. ఏమంటావ్?"

ఈ ప్రపోజల్ శర్వాణికీ నచ్చింది. ఇంకేం అడ్డు చెప్పకుండా సరేనన్నట్లు తలూపింది.

ఊహా లోకాల్లో సాగిన వారి కథ అప్పటికి ఆగిపోయింది.

X X X

వాస్తవిక జగత్తులో – కొన్ని రోజుల తరువాత మళ్ళీ మొదలయింది. కాని, పాత జంటతో కాదు. మరో కొత్త జంట శ్రీకృష్ణసత్యలతో!

రాత్రి తొమ్మిది గంటల వేళ....! ఆ సమయంలో డాక్టర్ శ్రీకృష్ణ బాల్కనీలో ఈజీచెయిర్ లో కూర్చుని ఆకాశం వైపు దృష్టి సారించి ఆలోచిస్తున్నాడు. అప్పుడే వచ్చి అతని వెనుకే నిలబడ్డ డాక్టర్ సత్య ఉనికిని గుర్తించలేదాతడు.

కొద్ది క్షణాల తరువాత అతని ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ అంది డాక్టర్ సత్య – "ఏమిటంత ఎడతెగని ఆలోచనల్లో మునిగిపోయారు?

తల తిప్పి చూసాడు శ్రీకృష్ణ.

"రా! కూర్చో!!" అన్నాడు చిన్నగా నవ్వి.

ఒక కుర్చీ లాక్కుని అతనికెదురుగా ఆసీనురాలయింది సత్య.

"ఒక చిత్రమైన ధర్మ సంకటంలో పడ్డాను. దాని గురించే ఆలోచిస్తున్నా! "

"ఏమిటో అది?"

"మొన్నా మధ్య నా దగ్గరకు కిరీటి అనే యువకుడు వచ్చాడు.తీరా చూస్తే అతడు నా బెస్ట్ ఫ్రెండ్ గంగాధరం అన్నయ్య కొడుకని తెలిసింది. అతని పెళ్ళి నిశ్చయమయింది.ప్రేమ వివాహమట. మొదట్లో ఇద్దరి కుటుంబాల పెద్దలూ వీళ్ళ ప్రేమకు అడ్డొచ్చారట. అతి కష్టం మీద ఒప్పించారట.

ఇంతకీవిషయమేమిటంటే – తను సాంసారిక  జీవనానికి అర్హుడో కాదో తెలుసుకోవాలని పరీక్ష చేయించుకోవాలని వచ్చాడు. – అతని  టెస్ట్ రిజల్ట్స్ చూసి నేను షాకయ్యాను.  వీర్య కణాల సంఖ్య అతి స్వల్పం. సంతానోత్పత్తికి తగిన స్థాయిలో లేవు.స్పెర్మ్ మొటిలిటీ కూడా అంతంత మాత్రమే!బ్లడ్ టెస్ట్ లో హార్మోన్ లోపాలు కూడా బహిర్గతమయ్యాయి.  ఐ పిటీ హిం! అతడు రేపు వస్తాడు.ఎన్నో ఆశలతో వివాహ బంధంలో అడుగుపెట్టడానికి సిద్ధపడుతున్న అతనికీ చేదు నిజం ఎలా తెలియజేయాలీ అని నాలో నేనే మధనపడుతున్నాను."

"అరె! నాకూ ఇలాంటి చిక్కు పరిస్థితే ఎదురయ్యింది. నాలుగైదు రోజుల క్రితం  నా దగ్గరకూ ఒక అమ్మాయి వచ్చింది. సరిగ్గా ఇలాంటి కథే! వీలైన అన్ని పరీక్షలూ చేసాను– చేయించాను.తేలిందేమిటంటే – ఫెల్లోపియన్ ట్యూబ్స్ మూసుకుపోయాయి.ఎగ్ ఫార్మేషన్ సవ్యంగానే ఉంది కాని, అండం శుక్ర కణంతో సంయోగం చెందే పరిస్థితి లేదు. గర్భాశయం ఏర్పాటులో కూడా లోపాలు గమనించాను. ఇక మీకు చెప్పేదేముంది? ఆ అమ్మాయీ తల్లి కాబోయే అదృష్టానికి నోచుకోలేదు."

ఉలిక్కి పడ్డాడు శ్రీకృష్ణ. "కొంపదీసి  ఆ అమ్మాయి పేరు శర్వాణి కాదు కదా" కంగారుగా అడిగాడు.

"అవును! శర్వాణే!"

ఒక క్షణం మరేమీ మాట్లాడలేకపోయాడు శ్రీకృష్ణ. చిన్నగా నిట్టూర్పు విడిచి అన్నాడు – " నాకిప్పుడు గుర్తుకొచ్చింది కిరీటి చెప్పిన విషయం.తను పెళ్ళాడబోయే శర్వాణిని కూడా పరీక్ష నిమిత్తం నీ వద్దకు పంపాడని. చూడు! విధి లీలలు ఎంత విచిత్రంగా ఉంటాయో! పిల్లల మీద అతనికెన్ని ఆశలు,కోరికలు ఉన్నాయో అతని మాటల ద్వారా నాకు అర్థమయింది. ఇప్పుడేం చెయ్యాలి మనం?ఈ చేదు నిజాన్ని వింటే వాళ్ళ గుండెలు ఆగిపోవూ? ఏం చేద్దామంటావ్?"

సత్యకు ఏమనడానికీ పాలుపోలేదు. – "మానవతా దృష్ట్యా....చెడ్డ ఇరకాటంలో పడ్డాం మనం....ఏదో ఒక పరిష్కారాన్ని మీరే సూచించండి." నెమ్మదిగా అంది.

శ్రీకృష్ణ చాలా సేపు ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు.

"హు....ఇదొక్కటే పరిష్కారం!" తనలో తానే గొణుక్కుంటున్నట్లు అన్నాడు.

" ఏమిటది?"

"వాళ్ళిద్దరిలోనూ ఎలాంటి లోపాలు లేవనీ...నిశ్చింతగా పెళ్ళి చేసుకోవచ్చనీ.... అబద్ధం చెప్పేద్దాం."

"అదెలా? అబద్ధమాడితే మన వృత్తికి ద్రోహం చేసిన వాళ్ళం కామూ? కలవరపడుతూ అంది సత్య.

నీరసంగా నవ్వాడు శ్రీకృష్ణ. నవ్వి చిన్నగా చెప్పాడు– "తప్పదు. ఇదొక్కటే మార్గం.వేరే దారి లేదు.ఉన్న విషయం చెబితే – భవిష్యత్ గురించి తీయటి కలలు కంటూ....ఊహా లోకాల్లో విహరిస్తున్న వాళ్ళు తట్టుకోలేరు.భరించలేరు.అనుకోని పరిస్థితులేర్పడి వాళ్ళు విడిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు. దిక్కు తోచని స్థితిలో.... పెద్దల ఒత్తిడికి లోనై వీళ్ళూ మరో ఇద్దరు నూతన వ్యక్తులతో జీవితం ముడి పెట్టుకోవడమే తటస్థిస్తే ....?"

" ఓహ్! అంతకన్నా ఘోరం మరొకటి ఉండదు.వీళ్ళిద్దరిదే కాక....ఎలాంటి లోపాలు లేని మరో ఇద్దరి జీవితాలు బలయ్యే అవకాశముంది." ఆందోళనగా అంది సత్య.

"వీళ్ళ ఆశలు అడియాసలు చేసిన విధివ్రాతను మనం ఎలాగూ మార్చలేం! కానీ,తప్పో ఒప్పో....ఒక అబద్ధంతో మరెక్కువ హాని జరగకుండా ఆపగలుగుతాం.కొన్నాళ్ళపాటైనా, వాళ్ళ దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో సాగిపోతుంది. ఏదో ఒకనాడు నిజం బయటపడక తప్పదనుకో! అయితే ఏం? కనీసం తాత్కాలికంగానైనా వాళ్ళు అశాంతికి లోను కాకుండా ఆపిన వాళ్ళం అవుతాం.ఇంతకు మించి మనం చేయగలిగింది లేదు. కాబట్టి మనం రేపు వాళ్ళకు చెప్పబోయేది ఒక తీయటి అబద్ధం మాత్రమే! ఏమంటావ్?"

అలాగేనన్నట్లు తలాడించింది సత్య శుష్క మందహాసం చేస్తూ.

XXXXXX★★★★★★★★★★XXXXXX

2022

సాయంత్రం వేళ. ఆరోజు పండగ రోజు కావడంతో హాస్పిటల్ కి సెలవు. శ్రీకృష్ణ సత్య లు ఇద్దరూ టెర్రస్ మీద పూల మొక్కల మధ్య కూర్చుని సేద తీరుతున్నారు.

ఇంతలో పనివాడు వచ్చి –"మీ కోసం ఎవరో ఇద్దరు వచ్చారు సార్! మిమ్మల్ని కలవాలంటున్నారు." చెప్పాడు.

ఇంటి దగ్గర పేషంట్లను చూడరు. రేపు హాస్పటల్ లో కలవమని చెప్పలేదూ?" చిన్నగా అన్నాడు శ్రీకృష్ణ నెమ్మదిగా.

"చెప్పాను సార్! మిమ్మల్ని కలవడం అర్జెంటట. ఈ చీటీ మీకు ఇమ్మన్నారు."

శ్రీకృష్ణ ఆ చీటీ అందుకుని "కిరీటి-శర్వాణి" అని బిగ్గరగా చదివాడు.

" రేర్ నేమ్స్! ఎప్పుడో విన్నట్టు ఉన్నాయి." సాలోచనగా అన్నాడు.

ఒక క్షణమాగి- "పైకి పిలు!" చెప్పాడు పనివాడికి.

కొద్ది నిముషాల్లో కిరీటి, శర్వాణి పైకి వచ్చారు.

కూర్చోమన్నట్లు సైగ చేసాడు శ్రీకృష్ణ.

ఇద్దరూ ఆసీనులైన తర్వాత - కిరీటి అన్నాడు- "ముప్పై ఏళ్ళ క్రితం కలిసాం. బహుశా మీకు మేము గుర్తులేక పోవచ్చు. మా ఇద్దరికీ పిల్లలు పుట్టే విషయం గురించి పరీక్షల నిమిత్తం మీ దగ్గరకు వచ్చాం." ఒక క్షణం ఆగాడు కిరీటి.

చటుక్కున సత్య కళ్ళు మెరిసాయి. "- ఔను! గుర్తొచ్చారు."అంటూ శ్రీకృష్ణ వైపు చూసింది. శ్రీకృష్ణ కూడ తనకూ గుర్తొచ్చిందన్నట్లు తల ఊపాడు.

తిరిగి కిరీటే అన్నాడు.- "మీరు ఆశించినట్లే మా పెళ్ళి జరిగింది. పెళ్ళయ్యాక కొద్ది రోజులకే నాకు అమెరికాలో ఉద్యోగం వచ్చింది. ఇద్దరం అమెరికా వెళ్ళిపోయాం. పెళ్ళయిన మూడు సంవత్సరాల వరకూ మాకు ఎలాంటి సందేహాలూ కలగలేదు. ఫేమిలీ ప్లానింగ్ పాటిస్తున్నామనే భ్రమలోనే ఉన్నాం. ఇక పిల్లాల్ని కనాలనే నిర్ణయానికి వచ్చాక- మరో రెండు మూడేళ్ళకు కూడా మాకు సంతానం కలగకపోవడంతో -అప్పుడు అనుమానమొ వచ్చి అక్కడి వైద్యుల్ని సంప్రదించాం. అప్పుడే మాకు గుండెలు పగిలే నిజం తెలిసింది.మానుంచి నిజం దాచిన మీ మీద చెప్పలేనంత ఆగ్రహం కలిగింది.తర్వాత కాస్త తేరుకున్నాక నిదానంగా అలోచించాక- మీరెంత ఆలోచించి ఆ నిర్ణయం తీసుకుని ఉంటారో మాకు అవగతమయింది.

ఏది ఏమైనా మాకు విధి చేసిన అన్యాయం జీర్ణించుకోవడం కష్ట సాధ్యమయింది. బ్రతుకుతో రాజీ పడుతూ ఎలాగోలా నూతన శతారంభం వరకూ బ్రతుకు బండి లాక్కుంటూ వచ్చాం. అప్పుడప్పుడే వైద్య రంగంలో మెరుగైన శాస్త్రీయ విధానాలు అందుబాటులోకి వచ్చి సంతాన సాఫల్య కేంద్రాలు మాబోటి వాళ్ళకు మిన్నగా సేవలు అందించడం మొదలవడంతో మాలో ఆశలు తిరిగి మొలకెత్తాయి.

అమెరికా లోని ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్ వారు ఎంతో ప్రయాసతో నా శుక్ర కణాలు సేకరించి నా భార్య అండాలతో ఫలదీకరణ చేయగలిగారు.సరోగసీ పద్ధతిలో ఎట్టకేలకు మాకు సంతాన ప్రాప్తి కలిగింది.అమెరికాలోని ఆ సంతాన సాఫల్య కేంద్రం వారి కృషి, సేవ మరువలేనివి.

ఇక నిజం చెప్పాలంటే- అప్పుదు మీరు ఒక అబద్ధం చెప్పి మా ప్రేమ విఫలం కాకుండా కాపాడారు.నిజం తెలిసి, మా మనసులు పాడై చెరో దారి చూసుకునే ప్రమాదం నుంచి మమ్మల్ని రక్షించారు.ఒక రకంగా

మా అబ్బాయి మీ వర ప్రసాదమే!అందుకే వాడికి "వర" అని పేరు పెట్టి అపురూపంగా పెంచాం. వాడిప్పుడు అమెరికాలో మెడిసిన్ చదువుతున్నాడు.ఇప్పుడు మీ ఆశీస్సుల కోసం తీసుకొచ్చాం.క్రింద వెయిట్ చేస్తున్నాడు."

"భలేవారే! పైకి రమ్మని పిలవండి." శ్రీకృష్ణ సత్యలు–ఏకకంఠంతో అన్నారు.

కిరీటి వెంటనే "వర" కు ఫోన్ చేసాడు.

శ్రీకృష్ణసత్యల జీవితంలో మరిచిపోలేని ఘడియ అది. ఒకనాడు ఎంతో తర్జనభర్జన పడి తాము తీసుకున్న నిర్ణయం సత్ఫలితం ఇచ్చినందుకు వారికెంతో అనందం కలిగింది. మాటల్లో చెప్పలేని ఉద్వేగానికి లోనైన వారిద్దరూ కళ్ళార్పకుండా టెర్రస్ తలుపు వైపే చూస్తూ కూర్చున్నారు. మరో కొద్ది నిముషాల్లో తలుపు చిన్నగా తెరుచుకుంది.

COMMENTS